కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 25, క్యాప్సికమ్ 61, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 23, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 24, చామగడ్డ 33, మొరంగడ్డ 18, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల అందజేత



సీఎం సహాయనిధి ఎల్‌ఓసీలను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ఇద్దరి శస్త్రచికిత్సల కోసం ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ వారికి రూ. 4.50 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాలను సోమవారం అందజేశారు. సీతాఫల్‌మండి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజేశ్వరి, అనిల్‌కుమార్ చికిత్సల నిమిత్తం మంజూరైన ఎల్‌ఓసీలను వారి కుటుంబసభ్యులకు అందజేశారు.

అధర్మంపై ధర్మం గెలిచింది: కార్పొరేటర్ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్: జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తన గెలుపును ప్రశ్నిస్తూ ప్రత్యర్థులు వేసిన కేసులో కోర్టు కేసును కొట్టివేసిందని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. సోమవారం వెల్లడైన ఈ కేసులో అధర్మంపై ధర్మం విజయం సాధించిందని ఆమె అన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బేగంపేట డివిజన్‌కు చెందిన 270 ఓట్లు రాంగోపాల్‌పేట్ డివిజన్‌కు మళ్లించి వాటిని బీజేపీ అభ్యర్థి అయిన తనకు పడేలా చేశారని నాటి బీఆర్‌ఎస్ పార్టీ తరుపున పోటీ చేసిన అత్తెల్లి అరుణగౌడ్ కేసువేశారని తెలిపారు. ఈ విషయమై ఆమె జీహెచ్‌ఎంసీ ఆర్వో, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌పై ఎలక్ట్రోరల్ కోర్టుకు వెళ్లగా ఆ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ కేసును డిస్మిస్ చేస్తూ తీర్పును వెల్లడించారని తెలిపారు.

గాంధీ రోగులకు సేవలు అభినందనీయం



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి రోగులకు మంచుకొండ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్‌ఎన్ రాజకుమారి అన్నారు. మంచుకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. గాంధీఆస్పత్రి రోగులకు మరింత మెరుగైన వసతులు కల్పించడంలో ఫౌండేషన్ తమ వంతు సాయం అందించిందని వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రస్టీ మంచుకొండ వరుణ్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

కుస్తీపోటీ విజేతలకు సన్మానం



కుస్తీ పోటీ విజేతలను సన్మానిస్తున్న మారుతీ వ్యాయామశాల నిర్వాహకులు

చిలకలగూడ: రాష్ట్ర, జిల్లాస్థాయి కుస్తీ పోటీల్లో విజేతలుగా నిలిచిన పవన్‌కుమార్, గణేష్‌లకు మైలార్‌గడ్డ మారుతీ వ్యాయామశాల నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. వ్యాయామశాల ప్రాంగణంలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ స్థానికులైన పవన్‌కుమార్, గణేష్‌లు మారుతీ వ్యాయామశాలలో శిక్షణ పొంది, కుస్తీ పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. వ్యాయామశాల నిర్వాహకులు ఎంఎస్ కుమార్, జలంధర్‌రెడ్డి, గాడ్‌శ్రీను, జాషువ, బ్యాంకు రమేష్, హరీష్, టీవీ శ్రీనివాస్, జగపతి, బుచ్చన్న పాల్గొన్నారు.

అకారణంగా వ్యక్తిపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా వ్యక్తిపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీరంగం రఘు రహమత్‌నగర్‌లో ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నాడు. ఈ నెల 8న రాత్రి బాలానగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి అర్ధరాత్రి ఇంటికి వెళ్తూ యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద పాన్‌కోసం ఆగాడు. ఆ సమయంలో యాదగిరినగర్‌కు చెందిన బి.సునీల్, బి.శంకర్, బి.అనిల్‌కుమార్ మద్యం తాగి అక్కడకు వచ్చి రఘుతో దుర్భాషలాడారు. ఇదేమని ప్రశ్నించగా కర్రలు, ఇనుప రాడ్లతో దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సైబర్ అలర్ట్

నేరాల నియంత్రణకు అవగాహన తరగతులు



- మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతాం
- విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల్లో మమేకం అవుతాం
- పౌరుల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ
- చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి



సికింద్రాబాద్: నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలబారిన పడకుండా ఉండేందుకు ప్రజలను అప్రమత్తం చేస్తామని..నేరాలను నియంత్రించడం, శాంతిభద్రతలను పరిరక్షించడానికి విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి చెప్పారు. ప్రజలతో స్నేహపూరిత వాతావరణాన్ని ఏర్పాటు చేసుకుని తద్వారా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. చిలకలగూడ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం సాక్షితో పలు విషయాలను వెల్లడించారు.

◆ సైబర్ నేరాల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

సైబర్ నేరాల బారిన పడుతున్న బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వివిధ పేర్లతో కాల్స్ చేస్తూ బ్యాంకు ఖాతాల్లో డబ్బును చోరీ చేస్తున్న నేరాలు పెరుగుతున్నాయి. సైబర్ నేరాలు జరుగుతున్న తీరు వాటి నుంచి బయటపడేందుకు అప్రమత్తంగా ఉండాల్సిన పద్ధతులను అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేస్తాం. సైబర్ నేరాలను ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్లలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాం. పెద్దమొత్తంలో జరిగిన మోసాల విషయంలో సలహాలు సూచనలు ఇచ్చి సైబర్ క్రైం కార్యాలయాలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నాం.

◆ రైల్వే ట్రాక్‌లు, ఫ్లై ఓవర్ వంతెనల వద్ద మాదక ద్రవ్యాల కట్టడికి ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

మాదక ద్రవ్యాల కట్టడికి ప్రజల నుంచి సహకారం కావాలి. అనుమానాస్పద వ్యక్తుల కదలికల సమాచారాన్ని పోలీసులకు అందించాలి. ఫిర్యాదు అందించిన వారిపేర్లు రహస్యంగా ఉంచి, 15 నిమిషాల్లో ఆయా ప్రాంతాల్లో పోలీసు బృందాలను పంపి చర్యలు తీసుకుంటాం. రైల్వే ట్రాక్‌లు, ఫ్లై ఓవర్ల ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బృందాలతో నిఘా ఏర్పాటు చేశాం. ఖాళీప్రదేశాలు, మైదానాలు, రైల్వే ట్రాక్‌ల వద్ద ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం.

◆ శాంతిభద్రతల పరిరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

అనుమానిత ప్రాంతాలు, వ్యక్తుల జాబితా మావద్ద ఉంది. నేరాలు జరిగే ప్రాంతాలను ముందే పసిగడుతున్నాం. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పాతనేరస్తుల జాబితా మా వద్ద ఉంది. అన్ని ప్రాంతాల ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకుంటాం. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రశాంత వాతావరణాన్ని ఏర్పాటు చేస్తాం.

◆ రాత్రి వేళల్లో జరిగే అలజడులను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నారా?

రాత్రి 11 తరువాత అన్ని రకాల దుకాణాలు మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం . పోలీసు నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా నేరాలు జరిగిన సందర్భాల్లో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అనవసరంగా రాత్రి వేళల్లో రహదారులపై అల్లరి చిల్లగా తిరిగి కేసులపాలై భవిష్యత్తును పాడు చేసుకోవద్దు.

12 నెలల వేతనం చెల్లించాలి



ప్రొ.పీఎల్ విశ్వేశ్వర్ రావుకు వినతి పత్రం అందచేస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 వర్సిటీలలో పని చేస్తున్న 900 పార్ట్ టైం లెక్చరర్స్ (పీటీఏల్)కు 12 నెలల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు ప్రొ.పీఎల్ విశ్వేశ్వర్ రావు, డా. చారకొండ వెంకటేష్‌కు అధ్యాపకులు వినతి పత్రం అందచేశారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నట్లు పార్టుటైం అధ్యాపకులు నెలకు రూ.50 వేల వేతనాన్ని చెల్లించాలని లేదా ఎంటీఎస్, బేసిక్ పే చెల్లించాలని కోరారు. పీజీ, పీహెచ్‌డీలు తదితర ఉన్నత విద్యఅర్హతలు ఉండి పర్మనెంట్ అధ్యాపకులతో పాటు సమాన పని చేసిన వేతనంలో చాల తేడా ఉందని (నెలకు రూ.15 వేల నుంచి రూ.వేలు) ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజీ ఆప్త రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎర్రం నాగేంద్ర, వ్యవస్థాపక అధ్యక్షులు డా.మేడి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్స్ డా. శ్రీలక్ష్మీ రెడ్డి, డా.మంచాల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



రసూల్‌పురా: న్యూబోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని శ్రీ పోచమ్మ దేవాలయం 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారికి అభిషేకం, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లిఖార్జున్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్‌లు వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

మహ్మద్‌గూడలో ఉచితవైద్య శిబిరం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్ గూడ ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ సామల హేమ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు సాధారణ వైద్యపరీక్షలతోపాటు బీపీ, షుగర్, పల్స్ ఆక్సీమీటర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోషకాహారం తీసుకోవడం ద్వారా చేకూరే లాభాలను వివరించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహ్మద్ గూడ ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎలిజబెత్, బీఆర్‌ఎస్ నాయకులు పింకీ, సంగీత, మెడికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

మంత్రివర్గ విస్తరణలో అన్యాయం: కరుణాకర్‌రెడ్డి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మంత్రి వర్గ విస్తరణలో రెడ్డి సామాజికవర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. మంత్రివర్గ విస్తరణలో కనీసం ముగ్గురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారికి పదవులు ఇచ్చే అవకాశం ఉందన్నారు. గతంలో ప్రభుత్వంలో ఆరుగురు రెడ్డి మంత్రులు ఉండేవారని ఇప్పుడు కేవలం ముగ్గురే ఉన్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు రెడ్డి సమావేశాలకు హాజరై అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని నెరవేర్చకపోవడం తగదన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్న రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ నియమించలేదని అన్నారు. సామాజిక న్యాయం పేరుతో రెడ్లను దూరంపెట్టడం శోచనీయమని అన్నారు.

ప్రొఫెసర్ జీబీ రెడ్డికి సన్మానం



ప్రొ.జీబీ రెడ్డిని సన్మానిస్తున్న వీసీ ప్రొ.కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: కేరళ సెంట్రల్ వర్సిటీకి వీసీగా నియమితులైన వర్సిటీ క్యాంపస్ న్యాయకళాశాల సీనియర్ అధ్యాపకులు, దూరవిద్య డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డిని సోమవారం ఓయూ వీసీ ప్రొ.కుమార్ ఘనంగా సన్మానించారు. గత వారం కేరళలోని కొచ్చి నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్ లీగల్ స్టడీస్ (ఎన్‌యూఏఎల్‌ఎస్) వీసీగా ప్రొ.జీబీ రెడ్డి నియమితులైన విషయం విదితమే. ఓయూ నుంచి ప్రొ.జీబీ రెడ్డి మంగళవారం రిలీవ్ కానున్నారు.

మద్యం దుకాణం అడ్రస్ చూపుతామంటూ..

అమీర్‌పేట: వైన్స్ షాపు అడ్రస్ చూపుతామని వెంట తీసుకుని వెళ్లి సెల్ ఫోన్ లాక్కున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందిన పారా ప్రవీణ్‌కుమార్ మాదాపూర్ కాకతీయ హిల్స్‌లో ఉంటూ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. సోదరుడి ఇంటికి వెళ్లేందుకు ఆదివారం రాత్రి గ్రీన్ ల్యాండ్ వద్ద బస్సుదిగి అమీర్‌పేట మైత్రివనమ్ వైపు వెళ్తుండగా ముందుకు వెళ్తున్న ఇద్దరిని వైన్స్ షాపు గురించి అడిగాడు. తమ వెంట వస్తే చూపిస్తామని అనడంతో వారి వెంట నడవసాగాడు. కొద్ది దూరం వెళ్లాక ప్రవీణ్ జేబులోని సెల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నారు. దొంగలు దొంగలు అంటూ కేకలు వేస్తూనే ఓ వ్యక్తిని పట్టుకున్నాడు. అప్రమత్తమైన స్థానికులు బాధితుడి వద్దకు చేరుకుని పట్టుపడిన వ్యక్తికి దేహశుద్ధి చేసి ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు మరొ దొంగను కూడా పట్టుకున్నారు. పట్టుపడ్డ ఇద్దరు నిందితులు కిషన్ థంగ్డే,రాహుల్ మస్కేగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి ధర్మకర్తలు అంకితభావంతో పనిచేయాలి

ముషీరాబాద్: దేవాలయాల అభివృద్ధికి ధర్మకర్తలు అంకితభావంతో పని చేయాలని ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. భోలక్‌పూర్‌లోని దేవునితోటలోని భవానీశంకర ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తల ప్రమాణస్వీకారం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఈఓ జ్యోతి హాజరై వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... దేవాలయానికి వచ్చే భక్తులకు మంచి దర్శనభాగ్యం కలిగించేలా ఆలయ కమిటీ, ధర్మకర్తలు చూడాలన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.

ఆలయ కమిటీ ధర్మకర్తలు...

భవానీశంకర ఆలయ నూతన కమిటీ ధర్మకర్తలు 16 మందిని నియమించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా మేడి సురేష్‌కుమార్, ధర్మకర్తలుగా ఎం.శ్వేత, పి.నర్సింగ్‌రావు, సాయిబాబా, నీల్‌చందర్, సూర్య చంద్రశేఖర్, క్రాంతి, కె.పరమేష్, లక్ష్మణ్, వై.పి. రాజు, మహేష్‌కుమార్, రాజు, తలారి నర్సింగ్ రావు, సురేందర్, కిసోర్‌యాదవ్, రంజిత్‌గౌడ్‌ను నియమించారు. వీరి పదవికాలం సంవత్సర కాలం పాటు ఉంటుందని ఈఓ జ్యోతి తెలిపారు.



ధర్మకర్తలతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఆలయ ఈఓ జ్యోతి

సర్కారు స్కూళ్లలో మెరుగైన విద్య

బన్సీలాల్‌పేట్: ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉపాధ్యాయులు బస్తీ బాట పట్టారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ జీరా హైదర్‌బస్తీలోని గుండా ఈశ్వరయ్య ప్రభుత్వ స్మారక పాఠశాల ఉపాధ్యాయులు బ్యానర్లు చేతబూని ప్రచారాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్నమాల ఉపాధ్యాయులతో కలిసి వివిధ ప్రాంతాల్లో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యాబోధన చేస్తున్నారని చెప్పారు. పుస్తకాలు, బ్యాగులు, ఉచిత భోజనంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత మెరుగైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు.



బడి బాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

మరోచోటికి చెట్ల తరలింపు

సనత్‌నగర్: ఆక్రమణలు తొలగించే క్రమంలో అడ్డుగా ఉన్న రెండు చెట్లను సురక్షితంగా మరో చోటికి తరలించి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. బేగంపేట టీటీఐ సమీపంలో నాలాను ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించే క్రమంలో ట్రాఫిక్ పోలీసులు అక్కడ ప్రమాదకరంగా ఉన్న ఒక అల్ల నేరేడు, రావిచెట్లను గుర్తించారు. దీంతో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు చొరవ తీసుకుని వేటా ఫౌండేషన్ సహకారంతో సోమవారం ఈ చెట్లను మరోచోటికి తరలించారు. అల్ల నేరేడు చెట్టును కంటోన్మెంట్ గ్రౌండ్‌కు, రావి చెట్టును బైసన్ పోలో గ్రౌండ్‌కు తరలించారు. చెట్ల తరలింపును కంటోన్మెంట్ బోర్డు సూపరింటెండెంట్ దేవేందర్, బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆర్‌ఎస్‌ఐలు అశోక్ రెడ్డి, శ్రీధర్ పర్యవేక్షణలో జరిగింది.



మురుగునీటి సమస్యను పరిష్కరించండి



సీతారాంనగర్‌లోని శ్రీజైదుర్గా భవానీ దేవాలయం రోడ్డుపై మురుగునీరు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి సీతారాంనగర్‌లోని శ్రీజైదుర్గా భవానీ దేవాలయం ప్రాంతంలో తరచూ ఎదురవుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ ధ్వంసమైన కారణంతో మురుగునీరు రోడ్డు మీదకు వస్తుండడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఫిర్యాదు చేసినపుడు జీహెచ్‌ఎంసీ సిబ్బంది రావడం తాత్కాలిక మరమ్మతులు చేసి వెళ్లడం, సమస్య మళ్లీ పునరావృతం కావడం పరిపాటి అయిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి పైప్‌లైన్ మార్చడం, మ్యాన్‌హోల్ కొత్తగా నిర్మించడం ద్వారా తాము ఎదుర్కుంటున్న మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

